14-02-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఉదయముదయమే లేచి తండ్రికి గుడ్ మార్నింగ్ చెప్పండి, జ్ఞాన చింతనలో ఉన్నట్లయితే సంతోషం యొక్క పాదరసము ఎక్కి ఉంటుంది"

ప్రశ్న:- యథార్థమైన స్మృతి అంటే ఏమిటి? దానికి గుర్తులేమిటి?

జవాబు:- చాలా ఓర్పుతో, గంభీరతతో మరియు వివేకముతో తండ్రిని స్మృతి చేయడమే యథార్థమైన స్మృతి. ఎవరైతే యథార్థమైన స్మృతిలో ఉంటారో, వారికి కరెంటు ఎక్కువగా లభిస్తుంది, పాపాల భారము తొలగుతూ ఉంటుంది. ఆత్మ సతోప్రధానంగా అవుతూ ఉంటుంది. వారి ఆయుష్షు పెరుగుతూ ఉంటుంది, వారికి తండ్రి యొక్క సెర్చ్ లైట్ లభిస్తుంది.

ఓంశాంతి. తండ్రి అంటారు, మధురమైన పిల్లలూ, తతత్వమ్ అనగా ఆత్మలైన మీరు కూడా శాంతి స్వరూపులు. ఆత్మలైన మీ అందరి స్వధర్మమే శాంతి. శాంతిధామము నుండి మళ్ళీ ఇక్కడకు వచ్చి టాకీగా అవుతారు. ఈ కర్మేంద్రియాలు పాత్రను అభినయించేందుకు మీకు లభిస్తాయి. ఆత్మ చిన్నదిగా-పెద్దదిగా అవ్వదు. శరీరము చిన్నది, పెద్దదిగా అవుతుంది. తండ్రి అంటారు, నేనైతే శరీరధారిని కాను. నేను పిల్లలను సమ్ముఖములో కలుసుకునేందుకు రావాల్సి ఉంటుంది. ఎలాగైతే ఒక తండ్రి ఉన్నారనుకోండి, వారికి పిల్లలు జన్మించినప్పుడు ఆ పిల్లలు ఈ విధంగా అనరు - నేను పరంధామం నుండి జన్మ తీసుకుని తల్లి-తండ్రులను కలుసుకోవడానికి వచ్చాను అని. ఎవరి శరీరములోకైనా ఒక కొత్త ఆత్మ వచ్చినప్పుడు, లేక ఎవరి శరీరములోకైనా ఒక పాత ఆత్మ ప్రవేశించినప్పుడు, నేను తల్లిదండ్రులను కలుసుకోవడానికి వచ్చాను అని ఈ విధంగా అనదు. వారికి ఆటోమేటిక్ గానే తల్లిదండ్రులు లభిస్తారు. ఇక్కడ ఇది కొత్త విషయము. తండ్రి అంటారు, నేను పరంధామం నుండి వచ్చి పిల్లలైన మీ సమ్ముఖములో ఉన్నాను. పిల్లలకు మళ్ళీ జ్ఞానం ఇస్తాను ఎందుకంటే నేను జ్ఞాన సంపన్నుడిని, జ్ఞాన సాగరుడినైన నేను పిల్లలైన మిమ్మల్ని చదివించేందుకు, రాజయోగం నేర్పించేందుకు వస్తాను. రాజయోగం నేర్పించేవారు భగవంతుడు మాత్రమే. శ్రీకృష్ణుని ఆత్మకు ఈ ఈశ్వరీయ పాత్ర లేదు. ప్రతి ఒక్కరి పాత్ర ఎవరిది వారిది, ఈశ్వరుని పాత్ర వారిది.

ఈ డ్రామా ఎలా అద్భుతంగా తయారుచేయబడి ఉంది, దీనిని కూడా మీరు ఇప్పుడు అర్థం చేసుకున్నారు. ఇది పురుషోత్తమ సంగమయుగము, కేవలం ఈ మాత్రం గుర్తున్నా కూడా మేము సత్యయుగములోకి వెళ్ళేవారము అన్నది పక్కా అయిపోతుంది. ఇప్పుడు సంగమములో ఉన్నారు, మళ్ళీ మన ఇంటికి వెళ్ళాలి, అందుకే పావనంగా అయితే తప్పకుండా అవ్వాలి. లోపల చాలా సంతోషం ఉండాలి. అహో! అనంతమైన తండ్రి అంటారు, మధురాతి-మధురమైన పిల్లలూ, నన్ను స్మృతి చేసినట్లయితే మీరు సతోప్రధానంగా అవుతారు, విశ్వానికి యజమానులుగా అవుతారు. తండ్రి పిల్లలను ఎంతగా ప్రేమిస్తారు. కేవలం టీచరు రూపంలో చదివించి తర్వాత ఇంటికి వెళ్ళిపోతారని కాదు. వీరైతే తండ్రి కూడా, టీచరు కూడా. మిమ్మల్ని చదివిస్తారు కూడా. స్మృతి యాత్రను కూడా నేర్పిస్తారు.

ఇలా విశ్వానికి యజమానులుగా తయారుచేసే, పతితుల నుండి పావనులుగా తయారుచేసే తండ్రిపై చాలా ప్రేమ ఉండాలి. ఉదయముదయము లేవడముతోనే మొట్టమొదట శివబాబాకు గుడ్ మార్నింగ్ చెప్పాలి. మీరు ఎంత ప్రేమతో స్మృతి చేస్తారో అంతగా సంతోషంలో ఉంటారు. మేము ఉదయమే లేచి అనంతమైన తండ్రిని ఎంతగా స్మృతి చేస్తున్నాము అని పిల్లలు తమ మనసును ప్రశ్నించుకోవాలి. మనుష్యులు భక్తిని కూడా ఉదయమే చేస్తారు కదా. భక్తి ఎంత ప్రేమతో చేస్తారు. కానీ బాబాకు తెలుసు, చాలామంది పిల్లలు ప్రాణప్రదముగా, ఎంతో ప్రేమతో స్మృతి చేయడము లేదు. ఉదయమే లేచి బాబాకు గుడ్ మార్నింగ్ చెప్పినట్లయితే, జ్ఞాన చింతనలో ఉన్నట్లయితే సంతోషపు పాదరసం ఎక్కుతుంది. తండ్రికి గుడ్ మార్నింగ్ చెప్పకపోతే పాపాల భారము ఎలా తొలగుతుంది. ముఖ్యమైనది స్మృతియే. దీనితో మీకు భవిష్యత్తు కోసం చాలా భారీ సంపాదన జరుగుతుంది, కల్ప-కల్పాంతరాలు ఈ సంపాదన ఉపయోగపడుతుంది. చాలా ఓర్పుతో, గంభీరతతో, వివేకముతో స్మృతి చేయవలసి ఉంటుంది. స్థూలమైన లెక్కలో, మేము బాబాను చాలా స్మృతి చేస్తున్నాము అనైతే అంటారు కానీ యథార్థమైన స్మృతి చేయడంలో శ్రమ ఉంది. ఎవరైతే తండ్రిని ఎక్కువగా స్మృతి చేస్తారో, వారికి కరెంటు ఎక్కువగా లభిస్తుంది ఎందుకంటే స్మృతితో స్మృతి కలుస్తుంది. యోగము మరియు జ్ఞానము, రెండు విషయాలు. యోగం యొక్క సబ్జెక్టు వేరు, చాలా భారీ సబ్జెక్టు. యోగంతోనే ఆత్మ

సతోప్రధానంగా అవుతుంది. యోగం లేకుండా సతోప్రధానంగా అవ్వడము అసంభవము. మంచి రీతిలో ప్రేమతో తండ్రిని స్మృతి చేసినట్లయితే ఆటోమేటిక్ గా కరెంటు లభిస్తుంది, ఆరోగ్యవంతులుగా అయిపోతారు. కరెంటుతో ఆయుష్షు కూడా పెరుగుతుంది. పిల్లలు స్మృతి చేసినట్లయితే బాబా కూడా సెర్చ్ లైటును ఇస్తారు. తండ్రి పిల్లలైన మీకు ఎంత గొప్ప భారీ ఖజానాను ఇస్తారు.

మధురమైన పిల్లలు దీనిని పక్కాగా గుర్తు ఉంచుకోవాలి, శివబాబా మమ్మల్ని చదివిస్తున్నారు. శివబాబా పతిత-పావనుడు కూడా. సద్గతి దాత కూడా. సద్గతి అనగా స్వర్గం యొక్క రాజ్యాన్ని ఇస్తారు. బాబా ఎంత మధురమైనవారు. కూర్చుని ఎంత ప్రేమతో పిల్లలను చదివిస్తారు. తండ్రి, దాదా ద్వారా మనల్ని చదివిస్తారు. బాబా ఎంత మధురమైనవారు. ఎంతగా ప్రేమిస్తారు. ఏ కష్టాన్ని ఇవ్వరు. కేవలం నన్ను స్మృతి చేయండి మరియు చక్రాన్ని గుర్తు చేయండి అని చెప్తారు. తండ్రి స్మృతిలో హృదయం పూర్తిగా నిలిచిపోవాలి. ఒక్క తండ్రి స్మృతే సతాయించాలి ఎందుకంటే తండ్రి ద్వారా ఎంత భారీ వారసత్వము లభిస్తుంది. తండ్రిపై మాకు ఎంత ప్రేమ ఉంది, ఎంతవరకు మాలో దైవీ గుణాలు ఉన్నాయి అని స్వయాన్ని చూసుకోవాలి ఎందుకంటే పిల్లలైన మీరు ఇప్పుడు ముళ్ళ నుండి పుష్పాలుగా అవుతున్నారు. ఎంతెంతగా యోగములో ఉంటారో అంతగా ముళ్ళ నుండి పుష్పాలుగా, సతోప్రధానముగా అవుతూ ఉంటారు. పుష్పాలుగా అయిన తర్వాత ఇక్కడ ఉండలేరు. స్వర్గమే పుష్పాల తోట. ఎవరైతే చాలా ముళ్ళను పుష్పాలుగా తయారుచేస్తారో, వారినే సత్యమైన సుగంధ-భరిత పుష్పము అని అంటారు. వారు ఎప్పుడూ ఎవ్వరికీ ముళ్ళను గుచ్చరు. క్రోధము కూడా పెద్ద ముల్లు. చాలామందికి దుఃఖాన్ని ఇస్తారు. ఇప్పుడు పిల్లలైన మీరు ముళ్ళ ప్రపంచము నుండి దూరంగా తీరానికి వచ్చేసారు, మీరు సంగమములో ఉన్నారు. ఏ విధంగా తోటమాలి పుష్పాలను తీసి వేరే పూలకుండీలో ఉంచుతారో, అలాగే పుష్పాలైన మీరు కూడా ఇప్పుడు సంగమయుగీ పూలకుండీలో వేరుగా ఉంచబడ్డారు. తర్వాత పుష్పాలైన మీరు స్వర్గములోకి వెళ్తారు. కలియుగీ ముళ్ళు భస్మమైపోతాయి.

పారలౌకిక తండ్రి నుండి మనకు అవినాశీ వారసత్వం లభిస్తుందని మధురమైన పిల్లలకు తెలుసు. ఎవరైతే సత్యాతి-సత్యమైన పిల్లలో, ఎవరికైతే బాప్ దాదాపై పూర్తి ప్రేమ ఉంటుందో, వారికి చాలా సంతోషం ఉంటుంది. మనం విశ్వానికి యజమానులుగా అవుతాము. అయితే పురుషార్థముతోనే విశ్వానికి యజమానులుగా అవ్వడము జరుగుతుంది. కేవలము అనడముతో అలా అవ్వరు. అనన్యమైన పిల్లలు ఎవరైతే ఉంటారో, వారికి ఎల్లప్పుడూ ఇది గుర్తు ఉంటుంది - మేము మా కోసం మళ్ళీ అదే సూర్యవంశీ, చంద్రవంశీ రాజధానిని స్థాపన చేస్తున్నాము. తండ్రి అంటారు, మధురమైన పిల్లలూ, పిల్లలైన మీరు ఎంతగా అనేకుల కళ్యాణము చేస్తారో, అంతగా మీకు ప్రతిఫలము లభిస్తుంది. అనేకులకు మార్గం తెలియజేసినట్లయితే అనేకుల ఆశీర్వాదాలు లభిస్తాయి. జ్ఞాన రత్నాలతో జోలిని నింపుకుని మళ్ళీ దానం చేయాలి. జ్ఞాన సాగరుడు మీకు రత్నాలతో కూడిన పళ్ళాలను నింపి-నింపి ఇస్తారు. ఎవరైతే ఆ రత్నాలను దానం చేస్తారో, వారే అందరికీ ప్రియమనిపిస్తారు. పిల్లలకు లోపల ఎంత సంతోషము ఉండాలి. తెలివైన పిల్లలు ఎవరైతే ఉంటారో, వారైతే అంటారు, మేము బాబా నుండి పూర్తిగానే వారసత్వాన్ని తీసుకుంటాము. పూర్తిగా అతుక్కుని ఉంటారు. తండ్రితో చాలా ప్రేమ ఉంటుంది ఎందుకంటే ప్రాణాన్ని ఇచ్చే తండ్రి లభించారని తెలుసు. జ్ఞానం యొక్క ఎటువంటి వరదానాన్ని ఇస్తారంటే దానితో మనం ఎలా ఉన్నవారము ఎలా తయారవుతాము! నిరుపేద నుండి సంపన్నముగా అయిపోతారు! భండారమును అంతగా నింపేస్తారు. ఎంతగా తండ్రిని స్మృతి చేస్తారో అంతగా ప్రేమ ఉంటుంది, ఆకర్షణ కలుగుతుంది. సూది శుభ్రంగా ఉన్నట్లయితే అయస్కాంతము వైపుకు ఆకర్షితమవుతుంది కదా. తండ్రి స్మృతితో తుప్పు తొలగుతూ ఉంటుంది. ఒక్క తండ్రి తప్ప ఇంకెవ్వరూ గుర్తుకు రాకూడదు. ఎలాగైతే స్త్రీకి పతిపై ఎంత ప్రేమ ఉంటుంది. మీకు కూడా నిశ్చితార్థము జరిగింది కదా. నిశ్చితార్థం యొక్క సంతోషం ఎప్పుడైనా తగ్గుతుందా ఏమిటి? శివబాబా అంటారు, మధురమైన పిల్లలూ, మీకు మాతో నిశ్చితార్థము జరిగింది, బ్రహ్మతో నిశ్చితార్థం కాదు. నిశ్చితార్థము పక్కా అయిపోయింది అంటే వారి స్మృతే సతాయిస్తూ ఉండాలి.

తండ్రి అర్థం చేయిస్తారు, మధురమైన పిల్లలూ, పొరపాట్లు చేయకండి. స్వదర్శన చక్రధారిగా అవ్వండి, లైట్ హౌస్ గా అవ్వండి. స్వదర్శన చక్రధారిగా అయ్యే ప్రాక్టీసు బాగా ఉన్నట్లయితే మీరు జ్ఞాన సాగరుల వలె అయిపోతారు. ఎలాగైతే విద్యార్థులు చదువుకుని టీచరుగా అయిపోతారు కదా. మీ వ్యాపారమే ఇది. అందరినీ స్వదర్శన చక్రధారులుగా చేసినప్పుడే చక్రవర్తీ రాజా-రాణిగా అవుతారు, అందుకే బాబా ఎల్లప్పుడూ పిల్లలను అడుగుతారు - పిల్లలూ, స్వదర్శన చక్రధారిగా అయ్యి కూర్చున్నారా? తండ్రి కూడా స్వదర్శన చక్రధారి కదా. తండ్రి మధురమైన పిల్లలైన మిమ్మల్ని తిరిగి తీసుకువెళ్ళేందుకు వచ్చారు. పిల్లలైన మీరు లేకుండా మాకు కూడా విశ్రాంతి లేనట్లుగా అనిపిస్తుంది. సమయం

వచ్చినప్పుడు విశ్రాంతి లేనట్లుగా అవుతుంది, ఇక ఇప్పుడు మేము వెళ్ళాలి అని. పిల్లలు చాలా పిలుస్తారు, చాలా దుఃఖితులుగా ఉన్నారు. దయ కలుగుతుంది. ఇప్పుడు పిల్లలైన మీరు ఇంటికి వెళ్ళాలి. మళ్ళీ అక్కడి నుండి మీ అంతట మీరే సుఖధామానికి వెళ్తారు. అక్కడ నేను మీకు సహచరునిగా అవ్వను. మీ అవస్థ అనుసారంగా మీ ఆత్మ వెళ్ళిపోతుంది.

పిల్లలైన మీకు ఈ నషా ఉండాలి, మేము ఆత్మిక యూనివర్సిటీలో చదువుతున్నాము. మేము ఈశ్వరీయ విద్యార్థులము. మేము మనుష్యుల నుండి దేవతలుగా లేక విశ్వానికి యజమానులుగా అయ్యేందుకు చదువుతున్నాము. దీని ద్వారా మేము అన్ని డిగ్రీలను పొందుతాము. ఆరోగ్యం గురించిన చదువును కూడా చదువుతాము, స్వభావం సరిదిద్దబడే జ్ఞానాన్ని కూడా చదువుతాము. హెల్త్ మినిస్ట్రీ, ఫుడ్ మినిస్ట్రీ, ల్యాండ్ మినిస్ట్రీ, బిల్డింగ్ మినిస్ట్రీ అన్నీ ఇందులో వచ్చేస్తాయి. మీరు పెద్ద కోశాధికారి కూడా. మీ వద్ద ఉన్న అమూల్య ఖజానా ఇంకెవ్వరి వద్ద ఉండజాలదు. ఇలా-ఇలా పిల్లలైన మీరు విచార సాగర మంథనం చేసి ఆత్మిక నషాలో ఉండాలి.

మధురాతి-మధురమైన పిల్లలకు తండ్రి కూర్చుని అర్థం చేయిస్తారు, ఎప్పుడైనా ఏదైనా సభలో భాషణ చేసేటప్పుడు లేక ఎవరికైనా అర్థం చేయిస్తున్నప్పుడు ఘడియ-ఘడియ చెప్పండి - స్వయాన్ని ఆత్మగా భావిస్తూ పరమపిత పరమాత్మను స్మృతి చేయండి అని. ఈ స్మృతితోనే మీ వికర్మలు వినాశనమవుతాయి, మీరు పావనంగా అవుతారు, ఘడియ-ఘడియ దీనిని గుర్తు చేసుకోవాలి. కానీ దీనిని కూడా, మీరు ఎప్పుడైతే స్వయం స్మృతిలో ఉంటారో అప్పుడే చెప్పగలరు. ఈ విషయంలో పిల్లలలో చాలా బలహీనత ఉంది. స్మృతిలో ఉన్నప్పుడే ఇతరులకు అర్థం చేయించినా ప్రభావం ఉంటుంది. మీరు మాట్లాడడము అనేది ఎక్కువగా ఉండకూడదు. ఆత్మాభిమానులై కొద్దిగా అర్థం చేయించినా బాణం కూడా తగులుతుంది. తండ్రి అంటారు, పిల్లలూ, గడిచినదేదో గడిచిపోయింది. ఇప్పుడు మొదట స్వయాన్ని సరిదిద్దుకోండి. స్వయము స్మృతి చేయరు, ఇతరులకు చెప్తూ ఉంటారు, ఈ మోసం నడవజాలదు. లోపల మనసు తప్పకుండా తింటూ ఉంటుంది. తండ్రిపై పూర్తి ప్రేమ లేకపోతే శ్రీమతముపై నడవరు. అనంతమైన తండ్రి వంటి శిక్షణను మరెవ్వరూ ఇవ్వలేరు. తండ్రి అంటారు, మధురమైన పిల్లలూ, ఈ పాత ప్రపంచాన్ని ఇప్పుడు మర్చిపోండి. చివర్లో దీనినంతా మర్చిపోవాల్సిందే. తమ శాంతిధామము మరియు సుఖధామముతో బుద్ధి జోడించబడుతుంది. తండ్రిని స్మృతి చేస్తూ-చేస్తూ తండ్రి వద్దకు వెళ్ళిపోవాలి. పతిత ఆత్మ అయితే వెళ్ళలేదు. అది ఉన్నదే పావన ఆత్మల ఇల్లు. ఈ శరీరం 5 తత్వాలతో తయారుచేయబడి ఉంది. కావున 5 తత్వాలు ఇక్కడ ఉండేందుకు లాగుతూ ఉంటాయి ఎందుకంటే ఆత్మ ఈ ఆస్తిని తీసుకున్నట్లుగా ఉంటుంది, అందుకే శరీరంపై మమకారం ఏర్పడింది. ఇప్పుడు దీనిపై మమకారాన్ని తొలగించుకుని మన ఇంటికి వెళ్ళాలి. అక్కడైతే ఈ 5 తత్వాలు ఉండవు. సత్యయుగంలో కూడా శరీరం యోగబలంతో తయారవుతుంది, సతోప్రధాన ప్రకృతి ఉంటుంది అందుకే ఆకర్షించదు. దుఃఖం ఉండదు. అర్థం చేసుకునేందుకు ఇవి చాలా సూక్ష్మమైన విషయాలు. ఇక్కడ 5 తత్వాల బలము ఆత్మను లాగుతుంది, అందుకే శరీరమును విడిచిపెట్టాలని మనసుకు అనిపించదు. లేదంటే ఇందులో ఇంకా సంతోషము ఉండాలి. పావనంగా అయ్యి శరీరాన్ని ఎలా వదులుతారు అంటే వెన్న నుండి వెంట్రుకను తీసినట్లుగా వదులుతారు. కావున శరీరము నుండి, అన్ని వస్తువుల నుండి మమకారాన్ని పూర్తిగా తొలగించాలి. వీటితో మనకు ఎటువంటి కనెక్షన్ లేదు. మనం బాబా వద్దకు వెళ్తాము, అంతే. ఈ ప్రపంచం నుండి మీ బ్యాగ్-బ్యాగేజిని సిద్ధం చేసుకుని ముందే పంపించేసారు. ఇక్కడివి తోడుగా అయితే రాలేవు. ఇకపోతే, ఆత్మలు వెళ్ళాలి. శరీరాన్ని కూడా ఇక్కడే విడిచిపెట్టాలి. బాబా కొత్త శరీరం యొక్క సాక్షాత్కారం చేయించారు. వజ్ర-వైఢూర్యాల మహళ్ళు లభిస్తాయి. అటువంటి సుఖధామంలోకి వెళ్ళేందుకు ఎంత శ్రమ చేయాలి. అలసిపోకూడదు. రాత్రి-పగలు చాలా సంపాదన చేసుకోవాలి, అందుకే బాబా అంటారు, నిద్రను జయించే పిల్లలూ, నన్నొక్కరినే స్మృతి చేయండి మరియు విచార సాగర మంథనం చేయండి. డ్రామా రహస్యాన్ని బుద్ధిలో ఉంచుకోవడము ద్వారా బుద్ధి పూర్తిగా శీతలమైపోతుంది. మహారథి పిల్లలు ఎవరైతే ఉంటారో, వారు ఎప్పుడూ కదలరు. శివబాబాను స్మృతి చేసినట్లయితే వారు సంభాళిస్తారు కూడా.

తండ్రి పిల్లలైన మిమ్మల్ని దుఃఖం నుండి విడిపించి శాంతి దానం ఇస్తారు. మీరు కూడా శాంతి దానము ఇవ్వాలి. మీ ఈ అనంతమైన శాంతి అనగా యోగబలం ఇతరులను కూడా పూర్తిగా శాంతింపజేస్తుంది. వీరు మన ఇంటికి సంబంధించిన వారా, కాదా అన్నది వెంటనే తెలిసిపోతుంది. వీరు మా బాబా అని ఆత్మకు వెంటనే ఆకర్షణ కలుగుతుంది. నాడిని కూడా చూడవలసి ఉంటుంది. తండ్రి స్మృతిలో ఉండి అప్పుడు చూడండి, ఈ ఆత్మ మన కులానికి చెందినవారేనా అని. ఒకవేళ మన కులానికి చెందినవారైతే పూర్తిగా శాంతిగా అయిపోతారు. ఎవరైతే ఈ కులానికి చెందినవారో, వారికే ఈ

విషయాలలో అభిరుచి కూర్చుంటుంది. పిల్లలు స్మృతి చేసినట్లయితే తండ్రి కూడా ప్రేమిస్తారు. ఆత్మను ప్రేమించడము జరుగుతుంది. ఎవరైతే చాలా భక్తి చేసారో, వారే ఎక్కువగా చదువుతారని కూడా తెలుసు. తండ్రిపై ఎంత ప్రేమ ఉంది అన్నది వారి ముఖం ద్వారా తెలిసిపోతూ ఉంటుంది. ఆత్మ తండ్రిని చూస్తుంది. తండ్రి ఆత్మలైన మనల్ని చదివిస్తున్నారు. మేము ఇంత చిన్న బిందువైన ఆత్మను చదివిస్తున్నామని తండ్రి కూడా భావిస్తారు. మున్ముందు మీకు ఈ అవస్థ ఏర్పడుతుంది. మేము సోదరులకు చదివిస్తున్నామని అర్థం చేసుకుంటారు. ముఖం సోదరిదైనా కానీ, దృష్టి ఆత్మ వైపుకు వెళ్ళాలి. శరీరం వైపుకు దృష్టి అసలు వెళ్ళకూడదు, ఇందులో చాలా శ్రమ ఉంది. ఇవి చాలా సూక్ష్మమైన విషయాలు. చాలా ఉన్నతమైన చదువు. తూకం వేసినట్లయితే ఈ చదువు వైపు చాలా భారీ అయిపోతుంది. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. గడిచినదేదో గడిచిపోయింది అని భావిస్తూ మొదట స్వయాన్ని సరిదిద్దుకోవాలి. ఆత్మాభిమానులుగా ఉండే శ్రమ చేయాలి. ఎక్కువగా మాట్లాడకూడదు.

2. తమ జోలిని జ్ఞాన రత్నాలతో నింపుకొని, వాటిని దానం చేసి అనేకుల కళ్యాణానికి నిమిత్తులుగా అవ్వాలి. అందరికీ ప్రియమైనవారిగా అవ్వాలి. అపారమైన సంతోషంలో ఉండాలి.

వరదానము:- కర్మక్షేత్రములో కమల పుష్ప సమానంగా ఉంటూ మాయ యొక్క బురద నుండి సురక్షితంగా ఉండే కర్మయోగీ భవ

కర్మయోగినే వేరే పదాలలో కమల పుష్పము అని అంటారు. కర్మయోగీ అనగా కర్మ మరియు యోగము, రెండు కంబైండ్ గా ఉండాలి, ఏ కర్మ యొక్క భారము అనుభవమవ్వకూడదు. ఏ రకమైన బురద అనగా మాయ యొక్క వైబ్రేషన్ టచ్ చేయకూడదు. ఆత్మ యొక్క బలహీనతతో మాయకు జన్మ లభిస్తుంది. బలహీనతను సమాప్తం చేసుకునేందుకు సాధనము - ప్రతిరోజు యొక్క మురళీ. ఇదే శక్తిశాలి తాజా భోజనము. మనన శక్తి ద్వారా ఈ భోజనాన్ని జీర్ణం చేసుకున్నట్లయితే మాయ యొక్క బురద నుండి సురక్షితంగా ఉంటారు.

స్లోగన్:- సఫలత అనే తాళం చెవి ద్వారా సర్వ ఖజానాలను సఫలం చేసుకోవడమే మహాదానిగా అవ్వడము.